క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు సోమవారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు 99592 25466 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు అందజేయాలన్నారు.

గుడివాడ సీసీఎస్ ఎస్ఐగా దాసు



కోనేరుసెంటర్: గుడివాడ సీసీఎస్ ఎస్ఐగా ఎస్.స్వామిదాసు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ పి.జాషువాను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్ఐ దాసును ఎస్పీ అభినందించారు. పోలీస్ శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు.

కారు – బైక్ ఢీ : ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

లక్ష్మీపురం(చల్లపల్లి): జాతీయ రహదారి –216పై రోడ్డు ప్రమాదం జరిగింది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద కోళ్లఫారాల సమీపంలో సోమవారం మధ్యాహ్నం కారు – బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఘంటసాల మండలం దేవరకోటకు చెందిన ద్విచక్ర వాహనదారుడు దాసి శ్రీనివాసరావు తలకు తీవ్రమైన గాయం కావటంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది నల్లమ్మ, షఫీ ఘటనా స్థలికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి, మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సందడిగా వనసమారాధన



నడకుదురు(చల్లపల్లి): ప్రభుత్వ ఉద్యోగులు కార్తిక మాస ఉత్సవాలు సందడిగా జరుపుకున్నారు. సోమవారం మధ్యాహ్నం పృథ్వీశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉసిరి తోటలో ప్రభుత్వ ఉద్యోగుల వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో చేకు చినరాట్నాలు, ఈవో ఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈవోలు, 11 గ్రామ పంచాయతీల ఉద్యోగులు, 15 గ్రామ సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆట పాటలతో సందడి చేసి, భోజనాలు చేశారు. పంచాయతీ ఈవోలు పేర్ని మాధవేంద్రరావు, పిట్టి రాంబాబు, కొండవీటి చంద్ర హరీష్, ఆకుల సాంబశివరావు, బీవీ సుబ్బారావు, వీఆర్వో గొల్లపూడి రాజేంద్ర, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డప్పు శ్రీనుకు పురస్కారం



చల్లపల్లి: డప్పు శ్రీనుగా గుర్తింపు పొందిన డప్పు కళాకారుడు, చల్లపల్లికి చెందిన చాట్రగడ్డ శ్రీనివాసుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ఫౌండేషన్ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఈ నెల 10న గుంటూరులో కళా దర్బార్, అయోధ్య చారిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, మహాదాత ఆళ్ల దశరథ రామిరెడ్డి స్మారక ప్రతిభా పురస్కారాల సభ జరిగింది. డప్పు కళ ద్వారా దేశ విదేశాల్లో వందలాది ప్రదర్శనలు ఇవ్వటంతో పాటు, ఘంటసాల వెంకటేశ్వరరావు గొంతుతో అద్భుతమైన పాటలు ఆలపించే చాట్రగడ్డ శ్రీనివాసుడుకు ప్రతిభా పురస్కారం అందించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చేతులమీదుగా శ్రీనివాసుడు పురస్కారం అందుకున్నారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడి ఆచూకీ తెలపండి

బంటుమిల్లి: బంటుమిల్లి జూనియర్ ఫస్ట్ క్లాస్ సివిల్ జడ్జి ఇచ్చిన అరెస్ట్ వారెంట్‌పై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఏ.పైడిబాబు ఒక ప్రకటనలో కోరారు. పెదతుమ్మిడి పంచాయతీ శివారు బండ్లగూడెం గ్రామానికి చెందిన కోడూరు పేతురుపై నమోదైన కేసులో న్యాయమూర్తి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ ఇచ్చారన్నారు. నిందితుడు పేతురు పోలీసులకు కనిపించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని, అతడిని గుర్తించిన వారు 94407 96419 నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పాలని ఎస్ఐ కోరారు.

పంట కోత ప్రయోగం

అవనిగడ్డ: స్థానిక రెడ్రౌతు సీతామహాలక్ష్మి పొలంలో వ్యవసాయశాఖ సిబ్బంది సోమవారం పంటకోత ప్రయోగం చేపట్టారు. 4వ సచివాలయ వ్యవసాయశాఖ సహాయకులు సీహెచ్ నరేష్‌బాబు, ఏ జీవిత పంటకోత నూర్పించారు. వీటిని తూకం వేయగా ఎకరాకు 32 బస్తాల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతులు అన్నపరెడ్డి కృష్ణ, గుగ్గిలం శ్యాంకుమార్, చింతలపూడి రాఘవరావు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక సోమవారం పూజలు

నాగాయలంక: కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా భక్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. స్వామి వార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నది ఒడ్డున శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో శివలింగానికి భక్తులు పూజలు చేశారు. నది ఒడ్డున ప్రమిదల్లో దీపాలు వెలిగించి పూజలు జరిపారు. సోమవారం రాత్రి అఖండ కర్పూర జ్యోతితో ఆధ్యాత్మిక శోభ దేదీప్యమానమై విరాజిల్లింది. కృష్ణాతీరంలో మండపం ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన మూడు కుండములలో 18 కిలోల ముద్ద కర్పూరాన్ని ఏర్పాటు చేసి అర్చకుల బ్రహ్మత్వంలో పూజలు అనంతరం అయ్యప్ప భక్తులచే మూడింటిని ప్రజ్వలన గావించారు. కర్పూర దాతలుగా చలసాని సాయి సందీప్ మౌనిక దంపతులు వ్యవహరించారు. అనంతరం నిత్య నవ హారతులిచ్చారు. అమ్మనాన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో కంఠంనేని ప్రేమ్‌చంద్, లోహితశ్రీ ఆర్థిక సౌజన్యంతో 3,500 మందికి కార్తిక భోజనాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, మండవ బాలవర్ధిరావు, ప్రముఖులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీసమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష అభిషేకాలు, పూజ, అలంకారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. దాతల సహకారంతో 1,500 మందికి ఏర్పాటు చేసిన వన సమారాధన కార్యక్రమాన్ని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్, స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నాగాయలంకలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్య అన్నదాన సేవా కమిటీ ఆధ్వర్యంలో 52 మందికి పేద అనాథ వృద్ధులు, దివ్యాంగులకు నూతన దుస్తుల వితరణ, అన్నదానం నిర్వహించారు. ఈ మాసంలో అన్నదాతలుగా వ్యవహరించిన 60 మంది దాతల ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ దుస్తులను అన్నదాన సేవకుల చేతుల మీదుగా అందచేశారు. నిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు.

పెడన: పట్టణంలోని శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్త్యేశ్వరస్వామి దేవస్థానం, శ్రీశ్యామలాంబ సమేత సోమేశ్వరాలయం, బ్రహ్మపురంలోని శ్రీచౌడేశ్వరి దేవి ఆలయం, ఉరివిలో సోమేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

కృత్తివెన్ను: కృత్తివెన్ను శివాలయంలో లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్షార్చన పూజలు నిర్వహించారు. ఉదయం గో పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. చినపాండ్రాక, చినగొల్లపాలెం శివాలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి. గాంధీనగరం, చెరుకుమిల్లి, కృత్తివెన్ను పల్లెపాలెం గ్రామాల్లో కోటి దీపార్చనలు, వనసమారాధనలు జరిగాయి.

సహస్ర దీపోత్సవం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డలో వేం చేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో సహస్ర దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన, అనంతరం సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయకునికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం యాగశాల ప్రవేశం, దేవతా మూల మంత్ర హోమం, శ్రీ ఫలహోమం, రుద్రహోమం, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పెడన ఆగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ

నడకుదురు(చల్లపల్లి): గ్రామంలోని ప్రాచీన పుణ్య క్షేత్రం శ్రీ పృథ్వీశ్వర స్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. గ్రామానికి చెందిన నాయకులు, ఆలయ పెద్దలు మల్లుపెద్ది త్రివిక్రమరావు ఆధ్వర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు.

గూడూరు: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కంకటావలో ప్రసిద్ధి చెందిన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు జోగి రాజీవ్, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, మండల కన్వీనర్ పర్సం పెదబాబు, నాయకులు బుర్ర దుర్గారావు, నాగేంద్రం రాజేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో 15 వేల మందికి అన్నదానం చేశారు.

అవనిగడ్డ: స్థానిక శివాలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి లక్ష బిల్వార్చన, పది రకాల అభిషేకాలు చేశారు. అనంతరం సహస్ర దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా చేశారు.

బంటుమిల్లి: బంటుమిల్లి శ్రీ గంగ, పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి, పెదతుమ్మిడి శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి, అర్తమూరు శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు వైష్ణవాలయాల్లో భక్తుల సందడి నెలకొన్నాయి. భక్తుల భగవన్నామ స్మరణ, పండితుల వేద మంత్రాలతో మార్మోగాయి. భక్తులు లింగాకారంలో దీపాలు వెలిగించారు. పెదతుమ్మిడి శివాలయంలో ఉదయం లక్ష బిల్వార్చన, సహస్ర దీపార్చన, సామూహిక కుంకమ పూజలు చేశారు.



చిట్టిపిళ్లారయ్యస్వామి ఆలయంలో..

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో లక్ష బిల్వార్చన వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ బ్రహ్మత్వంలో విఘ్నేశ్వర పూజ, మహన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, పుష్పార్చన, సహస్ర దీపోత్సవం, మహానివేదన చేపట్టారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ కేవీవీ సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మచిలీపట్నం బులియన్ అండ్ డైమండ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సహస్ర దీపారాధనను నిర్వహించారు. ఆలయ ఈవో డి.సుబ్బరాజు, ముఖ్య అర్చకుడు ఘంటసాల భాస్కరశర్మ పర్యవేక్షించారు. నగరంలోని అన్ని ఆలయాలతో పాటు బుట్టాయిపేట చిట్టిపిళ్లారయ్యస్వామి ఆలయంలో శివలింగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పూజలు చేశారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: నగరంలోని 5వ డివిజన్‌లో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) సోమవారం విస్తృతంగా పర్యటించారు. డివిజన్ పరిధిలోని సర్కారుతోటలో పర్యటించి మహిళలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంకా నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో నీటిని త్వరితగతిన తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో అభివృద్ధి చెందిన రహదారులు, అభివృద్ధి చేయని రహదారుల వివరాలను అడిగి తెలుసుకుని అభివృద్ధి చెందని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పలు గృహాల వద్ద అరుగులపైనే కూర్చుని అక్కడి మహిళలు చెప్పే సమస్యలను ఓపికగా విన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), డివిజన్ ఇన్‌చార్జి వేముల వనబాబు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు నేమ్‌బోర్డు ఏర్పాటు

పెడన: పట్టణంలోని 14వ వార్డులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(బంగ్లా స్కూల్)కు నేమ్ బోర్డును ఆ పాఠశాల పూర్వ విద్యార్థి సోమవారం ఏర్పాటు చేయించారు. 1933వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన పాఠశాలకు నేమ్ బోర్డును పూర్వ విద్యార్థి మట్టా రాధాకృష్ణమూర్తి అందించడం అభినందనీయమని ఎంఈవో–2 హరనాథ్ అన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎండీ బాబు, సాంబశివరావు, హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలతో జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): సఫాయి కర్మచారిలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల ద్వారా ఆర్థిక సాయాన్ని అందిపుచ్చుకుని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ పథకం ద్వారా సెప్టిక్ ట్యాంకులు శుభ్రపరిచే వాహనాలను లబ్ధిదారులకు సోమవారం కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ సఫాయి కర్మచారి ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా రూ.31,67,326 లు విలువ చేసే మూడు వాహనాలను లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఈ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీ లబ్ధిదారులకు వస్తుందని చెప్పారు. సఫాయి కర్మచారిలు గతంలో చేతులతో శుభ్రపరిచే వారని అలా కాకుండా అనారోగ్యం పాలు కాకూడదని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యంత్ర వాహనాలను సమకూరుస్తోందన్నారు. ఈ పథకంపై మున్సిపల్, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 11 మంది లబ్ధిదారులకు జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పత్రాలను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రలీల, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వాహనాలను అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు

'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయాలి

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం జయప్రదం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాలను గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు 51 రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబడ్డీల్లో 15 ఏళ్లు దాటిన బాల, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామ సచివాలయ పరిధిలో డిసెంబర్ 15 నుంచి జనవరి 1వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు రావి రాంప్రసాద్, గరికిపాటి గోవిందరాజులు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, లింగం జగదీష్‌కుమార్, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, బండారు సూరిబాబు, నందిగం అభిషేకరావు, మీసాల చిట్టిబాబు, మత్తి రాంప్రసాద్, ఎస్ఐ కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



మోపిదేవిలో క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారులు పాల్గొనాలి..

పెడన: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారులంతా పాల్గొనాలని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. సోమవారం ఆయన పెడన నియోజకవర్గ పరిధిలోని పెడన మండలంతో పాటు పెడన పురపాలక సంఘం, గూడూరు మండలాల్లోని గ్రామ, వార్డు సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల కిట్లను ఆయా సచివాలయాలకు అందజేశారు. కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, దావు బైరవలింగం, ఎంపీడీవో రెడ్డయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



క్రీడా కిట్లను పంపిణీ చేసిన రాజీవ్, ఎంపీపీ వాణి తదితరులు

పెడన పురపాలక సంఘంలో రాజీవ్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, బాబులాల్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, కమిషనర్ మహేంద్ర, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. గూడూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్‌తో పాటు జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పర్సం మహాలక్ష్మినాయుడు, ఎంపీడీవో సుబ్బారావు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకుంటాం

బంటుమిల్లి: మిచాంగ్ తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ములపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని కాపుటూరు, గొల్లగూడెం, దళితవాడ గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేసిన మనసున్న ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. గ్రామస్తులు గ్రామంలో పాఠశాల భవనాలు, తాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి ప్రభుత్వం ఆదుకుంటుందని వారికి ధైర్యం చెప్పారు. మంత్రి వెంట ఎంపీపీ వి.చినబాబు, వైస్ ఎంపీపీ ఓ.చిన్నారిబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, సర్పంచ్ బి.మంగమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ పి.బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.




కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్

జగనన్న పాలనలో విప్లవాత్మక మార్పులు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర చరిత్రలోనే పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 34, 36, 38 డివిజన్లతో పాటు మండలంలోని సుల్తానగరం, బొర్రపోతుపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న పేర్ని కిట్టు మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు బడే నాగరేవతి, మాచవరపు రాంప్రసాద్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకొళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్, మేకల సుబ్బన్న, రూరల్ కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్, సర్పంచులు పాల్గొన్నారు.

పర్రచివర గ్రామంలో పల్లెకు పోదాం

పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర సచివాలయం పరిధిలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ(చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు ప్రభుత్వ సందేశాన్ని వినిపించారు. అనంతరం అమలు చేసిన సంక్షేమం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈటీపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బుడిపల్లి బసవయ్య, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, గుంటూరు సురేష్, భరత్, మద్ది కొండలు, బండ్రెడ్డి లక్ష్మణ్, రేమాల నాగరాజు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



36వ డివిజన్‌లో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

పెనుమల్లి గ్రామంలో..

పెడన: పెనుమల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని పెనుమల్లి సర్పంచు గరికపాటి వెంకటరామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్లకు వస్త్రాల అందజేత

అవనిగడ్డ: స్థానిక మండలి పురంలోని సర్వకృపా ప్రార్థనా మందిరంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో డీఎస్పీ మురళీధర్ పాల్గొన్నారు. మోజెస్‌పాల్, మనోహర్ పాల్ పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న డీఎస్పీ పాస్టర్లు, విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 50 మంది పాస్టర్లకు డీఎస్పీ వస్త్రాలు అందజేశారు. షాలెం ఫెలోషిప్ ప్రార్థనా మందిరం అధ్యక్షుడు విలియం కేర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగాయలంక మండల ఫెలోషిప్ ప్రెసిడెంట్ కిరణ్ బాబు, పాస్టర్లు జీవనబాబు, ఏసోబు, ప్రభాకర్, ఏసుబాబు పాల్గొన్నారు.

30 మంది విశ్వాసులకు..

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలంలోని 30 విశ్వాసుల కుటుంబాలకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు నూతన వస్త్రాలను అందజేశారు. మండల పరిధిలోని ఘోటకం కాలనీ ఫెయిత్ టెంపుల్ చర్చిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శ్యాంకిశోర్ నాయుడు వస్త్రాలను విశ్వాసులు, కుటుంబ సభ్యులకు అందజేశారు. తొలుత సెమీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శ్యాంకిశోర్‌నాయుడు పలు ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక గాలిగోపురం సమీపంలోని సైబర్ జోన్ నందు శ్రీస్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా సోమవారం ప్రారంభించారు. 45 రోజుల పాటు శిక్షణ ఇస్తామని సైబర్ జోన్ ప్రతినిధి బీసాబత్తిన కృష్ణలీల కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

బంటుమిల్లి: దివ్యాంగులు అంగవైకల్యం ఉందని భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకుంటున్నాయని ఎంఈవో బి.త్రిపురసుందరీదేవీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పలువురు దివ్యాంగులకు బహుమతులను జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ అందజేశారు. బీసీ కాలనీలోని ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న ఆర్. వెంకటనాగరాజు అనే దివ్యాంగుడికి రూ.15 వేలు విలువ చేసే వినికిడి ట్యాబ్‌ను, నలుగురు విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే ఎంఆర్ కిట్లు అందజేశారు. ఎంఈవో వెంకటేశ్వరరావు, ఏవో రామకృష్ణశర్మ, ఫిజియోథెరపీ వైద్యులు హుస్సేన్, సీఆర్పీలు నాగబాబు, బుజ్జి, రమాదేవి, ఐఈఆర్‌టీ టీచర్స్ వనజ, రాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గూడూరు హైస్కూల్‌కు పతకాలు

గూడూరు: తిరుపతి, విజయనగరం ప్రాంతాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గూడూరు హైస్కూల్ పీడీ మత్తి అరుణ, విద్యార్థిని నిమ్మగడ్డ ప్రియదర్శిని పతకాల పంట పండించారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో తిరుపతిలో జరిగిన 42వ ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, 100 మీటర్స్ హర్డిల్స్ గూడూరు ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మత్తి అరుణ బంగారు పతకాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో ఆమె కృష్ణాజిల్లా తరపున పోటీల్లో పాల్గొన్నారు. విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో అండర్–14 విభాగంలో కృష్ణా జిల్లా తరపున పాల్గొన్న నిమ్మగడ్డ ప్రియదర్శిని గ్రూప్ ఈవెంట్లో సిల్వర్ మెడల్, వ్యక్తిగత విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించింది. వీరిని హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు.

చల్లపల్లిలో విజృంభించిన దొంగల ముఠా

చల్లపల్లి: చల్లపల్లిలో వరుస దొంగతనాలతో దొంగల ముఠా హడలెత్తించింది. ఆదివారం అర్ధరాత్రి స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న వైష్ణవి మెడికల్ షాపు, పొట్టి శ్రీరాములు వీధిలోని విజయ చాముండేశ్వరీ ఎలక్ట్రికల్ షాపు, ప్రధాన రహదారిలోని శ్రీదేవీ మెడికల్స్ దుకాణాల షట్టర్ల తాళాలు పగులగొట్టి చోరీలు చేశారు. వైష్ణవి మెడికల్స్‌లో రూ.లక్షన్నర, ఎలక్ట్రికల్ షాపులో రూ.9.500లు, శ్రీదేవీ మెడికల్స్‌లో రూ.10 వేలు చోరీ జరిగినట్లు యజమానులు తెలిపారు. దీంతో పాటు పొట్టి శ్రీరాములు వీధిలోని కొల్లిపర ఆంజనేయులు ఫెర్టిలైజర్స్, గ్రోమోర్ దుకాణం, అమ్మ మొబైల్స్ తాళాలు పగులగొట్టినప్పటికీ, చోరీ చేయలేదని దుకాణ యజమానులు తెలిపారు. ఆర్ఆర్ మొబైల్స్ దుకాణాల సీసీ కెమెరా వైర్లు కట్ చేశారు. చోరీలకు వచ్చిన దొంగల ముఠా ద్విచక్ర వాహనాలపై వచ్చి బస్టాండ్ సెంటర్‌లో తిరిగిన విజువల్స్ సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ఎస్ఐ సీహెచ్.చినబాబు ఆయా దుకాణాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పంట కోత ప్రయోగం

అవనిగడ్డ: స్థానిక రెడ్రౌతు సీతామహాలక్ష్మి పొలంలో వ్యవసాయశాఖ సిబ్బంది సోమవారం పంటకోత ప్రయోగం చేపట్టారు. 4వ సచివాలయ వ్యవసాయశాఖ సహాయకులు సీహెచ్ నరేష్‌బాబు, ఏ జీవిత 24 గజాల్లో పంటకోత నూర్పించారు. వీటిని తూకం వేయగా ఎకరాకు 32 బస్తాల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేశారు.